# నామకరణం (7వ పేజీ తరువాయి)

వారు ఆప్యాయంగా పలకరించటంలోనూ, మర్యాదల విషయంలోనూ మనకంటే ఎక్కువే గానీ తక్కువగా ఉండరు. మీరు రాలేదన్నదే లోటుగా కనిపించింది గానీ శుభకార్యం బాగా జరిగింది!" అని ఆవిడ జవాబు చెప్పింది.

"అయితే మరింకేమిటి? ఏమీ లేదని నువ్వంటున్నా నాకు నమ్మకం కుదరడం లేదు. నువ్వు మామూలుగా లేవని తెలుస్తూనే ఉంది. దేనికి మధనపడుతున్నావో చెప్పాల్సిందే..!" అంటూ ఆయన రెట్టించేసరికి తాయారమ్మకి చెప్పక తప్పలేదు. మనసులోని బాధను బయటపెట్టింది.

"నే వెళ్ళేసరికి మనబ్బాయి అక్కడే ఉన్నాడుగా, నేను ఆలోచించి ఉంచిన నాలుగు పేర్లూ చెప్పి ఏదో ఒకటి మీకు నచ్చిందే పెట్టండన్నాను. అలాగే అంటూనే వాడు ఇంకో రెండు, మూడు పేర్లు చెప్పి, ఒక పేరును బావుందిగా అంటూ అడిగాడు. అలా రెండు, మూడు సార్లు అడిగేసరికి నాకూ ఏదో విషయం ఉందనిపించింది. కోడలితో మాటల మధ్య నేనూ పేరు ప్రస్తావన తేగానే, తనకిష్టమైన పేరంటూ చెప్పి, అదే పెట్టాలనుకుంటున్నామనీ అంది. అప్పటికి నాకూ అర్థమైంది. అబ్బాయి ఆ పేరునే బావుంది కదా అంటూ ఎందుకడిగాడో? మరోసారి మళ్ళీ అలాగే అడిగేసరికి అవునని నేనూ చెప్పాను. ఆ మర్నాడు అదే పెట్టడమూ జరిగింది.."

రంగనాథంగారు మధ్యలోనే అందుకుంటూ "నువ్వు చెప్పిన పేరు పిల్లాడికి పెట్టలేదనా.. అంతలా బాధపడుతున్నావ్? అయినా నీ ఉద్దేశ్యం కూడా కన్నవాళ్ళ ఇష్టమూ ముఖ్యమని కదా.. మరి.. ఇప్పుడేమిటి? మనవడికి కోడలికి నచ్చిన పేరు పెడితే.. నువ్వు సంతోషించాలి కానీ.. ఇలా.. ఇదేమిటి?" అనడిగారు.

"మీకు అర్థమైంది ఇదా..?" అంటూ ఆవిడ ఆయన వైపు చురుగ్గా చూసింది. "కోడలికి ఇష్టమైన పేరు పెట్టడం నాకూ ఆనందమేనని తెలియనట్లుగా మన అబ్బాయి నన్ను మభ్యపెట్టి నిర్ణయమైపోయిన పేరును నాతోనే చెప్పించాలనుకోవడం.. నాకు కష్టంగా అనిపించింది!" ఆవిడ కంఠం రుద్ధమైంది.

'ఇంత చిన్న విషయానికా అలా బాధపడుతున్నావ్..?' అని అడగబోయిన ప్రశ్నని ఆవిడ మనస్తత్వం తెలుసు కనుక ఆయన బయటకు రానివ్వలేదు.

కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయిన ఆయన "ఈ సందర్భంగా నాకొకటి గుర్తుకొచ్చింది. చెబుతా.. విను.." అంటూ మొదలుపెట్టారు. "మొన్నా మధ్య ఎవరిదో ఒక పెళ్ళిలో, పాతిక సంవత్సరాల క్రితం నాకు పరిచయమున్న రంగారావు, రాఘవరావులను కలుసుకోవడం జరిగింది. అప్పట్లో వాళ్ళిద్దరికీ ఎందుకోగానీ ఒకరంటే ఒకరికి గిట్టేది కాదు. ఈ మధ్య కలుసుకున్నప్పుడు రాఘవ, రంగారావుతో 'పాతికేళ్ళ క్రితం ఎలా ఉన్నావో ఇప్పుడూ అలాగే ఉన్నావ్.. మార్పేం లేదు' అన్నాడు. ఎవరైనా అలా అంటే.. వయసు పెరిగిన విషయం తెలియనట్లుగా కనిపిస్తున్నందుకు ఆనందిస్తారా.. కానీ రాఘవ పట్ల సదభిప్రాయం లేనందువల్లే కాబోలు రంగరావుకి ఆ మాట ఇంకోలా అర్థమైంది. రాఘవ వెళ్ళిపోయాక రంగారావు నాతో 'చూడు.. వాడెలా వంకరగా మాట్లాడుతున్నాడో.. పాతికేళ్ళ క్రితమే నేను యాభై ఏళ్ళ వాడిలా ఉండేవాడినని ఉద్దేశ్యం కాబోలు!" అన్నాడు.

తాయారమ్మ అర్థం కాలేదన్నట్లుగా చూసింది.

"ఎదుటివాళ్ళ మాటలు, చర్యలూ మనకు అర్థం కావటంలో వాళ్ళ పట్ల మనకున్న అభిప్రాయమూ కొంత తోడవుతుంది! అవునా? మనబ్బాయి మునుపటిలా నీ ఇష్టానికి కాకుండా కోడలి వైపు మొగ్గు చూపాడని నీకు కొంచెం కష్టంగా అనిపించి ఉంటుంది. అది సహజమనీ, వాడు భార్య ఇష్టానికీ ప్రాముఖ్యం ఇవ్వాలి కదా అనుకుంటే' సమస్య ఉండదు. మునుపు నువ్వూ అదే అనేదానివి కదా..! ఇంకోమాట. పేరు నిర్ణయమైపోయాక బాధ్యత నీకప్పగించినట్లుగా వాడు నిన్ను భ్రమ పెట్టాడని అనుకుంటున్నావు. అలా కాకుండా ఇంకోవిధంగా ఆలోచించు.. కోడలికి నచ్చిన పేరు పెట్టాల్సి వచ్చినా, నీకిష్టమైనదే పెడుతున్నట్లుగా ఆ పేరును నీతోనే అంగీకరింపచేయాలని చూడటం అంటే.. నీకూ సంతోషం, సంతృప్తి కలిగించాలనే అభిప్రాయం ఉన్నట్లే కదా..! నీ మీద ఉన్న గౌరవం, ప్రేమాభిమానాలతోనే నిన్నూ ఆనందింప చేయాలని ఆరాటపడటమే గానీ మభ్యపెట్టటం కాదని నాకు అనిపిస్తోంది. మన ఆలోచనా విధానం కొంచెం మార్చుకుంటే.. కొన్ని సమస్యలు ఇట్టే సమసిపోతాయి.. ఏమంటావ్?"

ఆయన మాటలకు ఆవిడ ఆలోచనలో పడినట్లుగా రెండు క్షణాలు మౌనంగా ఉండిపోయింది. నిజమే సుమా అన్నట్లుగా ఆవిడ పెదవులపైకి చిన్న చిరునవ్వు వచ్చింది. దాంతో ఆవిడ మనసూ తేలిక పడిందని గ్రహించిన రంగనాథంగారూ సంతృప్తిగా నిట్టూర్చారు.

- గోగినేని మణి.. 94907 53335